# మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ పరామర్శ



మాజీ సర్పంచ్ కొంపెల్లి రాంరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నూతనకల్, ఏప్రిల్ 18: మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొంపెల్లి రాంరెడ్డి, కొణతం కృష్ణారెడ్డి, పులుసు కనకయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ శుక్రవారం వారిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చూడి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బిక్కి బుచ్చయ్య, మందడి సోమిరెడ్డి, బత్తుల విద్యాసాగర్, బత్తుల విజయ్, పులుసు లింగమల్లయ్య, గడ్డం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం

తిరుమలగిరి: బీపీ మండల్ అవార్డు గ్రహీత, మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన దయాయాదవ్‌ను మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ తిరుమలగిరిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం శాలువాతో సన్మానించారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సతీశ్‌కుమార్, దూపటి రవీందర్, శోభన్‌బాబు, బర్ల వెంకన్న, శంకర్, త్రిశూల్ పాల్గొన్నారు.

### పరామర్శ

తుంగతుర్తి: మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మాజీ వార్డు మెంబర్ ఏశమల్ల సుధాకర్ తండ్రి చిన్న బక్కయ్య ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి చిన్న బక్కయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాడికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, మల్యాల రాములు, రవి, శ్రావణ్ పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నివాళి



శంకర్‌నాయక్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మోతె, ఏప్రిల్ 18: మండలంలోని గోల్ తండా మాజీ సర్పంచ్ గుగులోతు శంకర్‌నాయక్ తల్లి కోమటి శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ వారి నివాసానికి వెళ్లి కోమటి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శీలం సైదులుయాదవ్, నాయకులు ఏలూరు వెంకటేశ్వరరావు, ఆరే లింగారెడ్డి, మిక్కిలినేని సతీశ్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, దేవుల మల్సూర్, రవినాయక్, గట్టోజి, కిషన్, సాజ్యా, రవీందర్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు కొర్రీలు

- కొనుగోలు కేంద్రాల్లో తాలు పేరుతో ఇబ్బందులు
- ధాన్యాన్ని తూర్పార పడుతున్న రైతులు



స్కూటీ వెలుతురులో ధాన్యాన్ని తూర్పార పడుతున్న రైతు శోభన్‌బాబు దంపతులు

అనంతగిరి, ఏప్రిల్ 18: యాసంగిలో ధాన్యం అమ్మేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు నిర్వాహకులు తాలు, తేమ పేరుతో కొర్రీలు పెడుతుండడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. అనంతగిరి మండలం పాత గోల్‌తండా ఆవాస గ్రామం మిట్య తండాకు చెందిన భూక్య శోభన్‌బాబు తన సొంత పొలం ఐదెకరాలతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. ఇటీవల వరి కోసి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌లో ఐదెకరాల ధాన్యం పోశాడు. అక్కడ స్థలం సరిపడా లేకపోవడంతో మరో ఐదెకరాల ధాన్యాన్ని తన పొలంలోనే పోశాడు. అయితే, ధాన్యం అమ్మేందుకు ప్రయత్నించగా తాలు ఉందని ఐకేపీ నిర్వాహకులు కొనలేదు. దీంతో రాత్రి పూట వీస్తున్న గాలులకు భార్య సాయంతో తన స్కూటీ లైట్ ఆన్ చేసుకొని ఆ వెలుతురులో ధానాన్ని తూర్పార పడుతున్నాడు. ఈ విషయమై నమస్తే తెలంగాణ ఆయనను పలుకరించగా ధాన్యాన్ని అమ్మేందుకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తాలు లేకుంటేనే మద్దతు ధర లభిస్తుందని చెప్పడంతో రాత్రిపూట వీస్తున్న గాలులకు ధాన్యం తూర్పార పడుతున్నామని చెప్పారు.

# అనుమతులు లేకుండా చెరువు మట్టి తరలింపు

- అడ్డుకున్న నెమ్మికల్ గ్రామస్తులు



చెరువు మట్టిని తరలిస్తుండగా అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 18: మండల పరిధిలోని నెమ్మికల్ చౌట చెరువు నుంచి నల్లమట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్న ట్రాక్టర్లను, జేసీబీని గ్రామస్తులు శుక్రవారం అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొందరు ఇటుక బట్టీల యజమానులు అధికారులకు లంచాలు ఇచ్చి అన్ని అనుమతులు ఉన్నాయంటూ స్థానికులను బెదిరిస్తూ చెరువు మట్టి తరలించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గత వారం రోజుల క్రితం మట్టిని తరలిస్తుంటే అడ్డుకున్నప్పటికీ, మళ్లీ శుక్రవారం మట్టి తరలించే ప్రయత్నం చేశారని తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ఇటుక బట్టీలకు చెరువు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను, జేసీబీని స్థానికులు పోలీసులకు పట్టించారని తెలిపారు. చెరువు మట్టి తరలింపుపై తాసీల్దార్‌కు లేఖ రాశామని, అనుమతుల విషయమై తాసీల్దార్ నుంచి సమాచారం వచ్చాక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# 'సెమినార్‌ను విజయవంతం చేయాలి'

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 18: 'వక్ఫ్ సవరణ రాజ్యాంగ విరుద్ధం' అనే అంశంపై జిల్లా కేంద్రంలోని మమత బాంకెట్ హాల్‌లో ఈ నెల 22న జరుగనున్న సెమినార్‌ను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ముస్లింలతో కలిసి సెమినార్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ, ముస్లిం, మైనార్టీ, దళిత, ఆదివాసీ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సీపీఎం ఆధ్వర్యంలో సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, మైనార్టీ నాయకులు ఫక్రుద్దీన్, మౌలానా అస్రార్ సాహెబ్, ఆవాస్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షాకీరా హుస్సేన్, షేక్ జహంగీర్, రఫీ, ఇమామ్, రఫీయోద్దీన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ ప్రమాదంలో ఏడుగురికి తీవ్రగాయాలు

కోదాడ రూరల్, ఏప్రిల్ 18: లిఫ్ట్ ప్రమాదంలో ఏడుగురికి తీవ్రగాయాలైన ఘటన కోదాడ పట్టణంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీమన్నారాయణ కాలనీలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లోని ఇంట్లో గురువారం జరిగిన దశదిన కర్మకు బంధువులు హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం లిఫ్ట్‌లో తిరుగు ప్రయాణంలో ఎక్కువ మంది ఎక్కడంతో 4వ అంతస్తు నుంచి లిఫ్ట్ జారిపడి ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి.

# రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

- నేరేడుచర్ల - దూపాడు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో జాప్యం
- కల్వర్టులు నిర్మించి రోడ్డు పనులు మరిచిన వైనం



గుంతలమయంగా నేరేడుచర్ల – దూపాడు రోడ్డు

నేరేడుచర్ల, ఏప్రిల్ 18: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదు అన్న చందంగా మారింది మండలంలోని నేరేడుచర్ల – దూపాడు రోడ్డు పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు మాత్రం సాగకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో వాహనాలు నడపలేక డ్రైవర్లు, కూర్చోలేక ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

### రూ.16 కోట్లు మంజూరైనా..

నేరేడుచర్ల మున్సిపాలిటీ శివారు నుంచి పెన్‌పహాడ్ మండలంలోని దూపాడు వరకు 13 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు ఏడాది క్రితం రూ.16 కోట్ల నిధులు మంజూరు చేసింది. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తయితే తమ ఇబ్బందులు తొలిగిపోతాయని ప్రజలు భావించారు. అయితే, ఆయా గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది. రోడ్డు నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ ఈ రోడ్డులో కల్వర్టులను మాత్రమే నిర్మించి రోడ్డు పనులు చేపట్టకపోవడంతో మేడారం, ఫత్తేపురం, లాల్‌లక్ష్మీపురం, వైకుంఠాపురం, జానల్‌దిన్నె తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన నేరేడుచర్లకు ప్రతి నిత్యం ఏదో ఒక పని నిమిత్తం లేదా ఇతర దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినా ఈ రోడ్డే గతి. కానీ అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు మీదుగా ప్రయాణించలేక పలువురు కిందపడి గాయాలు కావడం వంటి సంఘటనలు కూడా అనేకం చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతుండడంతో ధాన్యం ట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు మొత్తం మరింత గుంతలమయంగా మారింది. నేరేడుచర్ల, పెన్‌పహాడ్ మండలాలకు అనుసంధానమైన ఈ రోడ్డు పనులను ఉన్నతాధికారులు చొరవ తీసుకొని త్వరితగతిన పూర్తి చేసి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# హుజూర్‌నగర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బదిలీ

హుజూర్‌నగర్, ఏప్రిల్ 18: హుజూర్‌నగర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్‌ను సాధారణ బదిలీల్లో భాగంగా నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా రంగారెడ్డి జిల్లా కోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సంగారెడ్డి కోర్టులో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న రాధాకృష్ణ చౌహాన్‌ను నియమించారు.

# జిల్లా కేంద్రంలో పోలీసుల తనిఖీలు



కొత్త బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 18: మాదక ద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు గానూ ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్, హైటెక్ బస్టాండ్ ప్రాంగణాలతో పాటు పలు రద్దీ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాల్లో శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల లగేజీతో పాటు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. పట్టణ సీఐ వీరరాఘవులు ప్రయాణికులతో మాట్లాడి భద్రతా చర్యల పట్ల అవగాహన కల్పించారు. రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉన్న సూర్యాపేటలో మెరుగైన భద్రత కల్పించడం, డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా నిరోధించడం, కొత్త వ్యక్తుల కదలికలు గుర్తించడంలో భాగంగా తనిఖీలు నిర్వహించామని సీఐ చెప్పారు. ఈ తనిఖీల్లో డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో పాటు ఎస్‌ఐ ఆంజనేయులు, ఆర్‌ఎస్‌ఐ మహేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తిరుమలగిరి: గుండెపురి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాసీల్దార్ హరిప్రసాద్

మోతె, ఏప్రిల్ 18: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర లభిస్తుందని సర్వారం పీఏసీఎస్ చైర్మన్ ముప్పాని శ్రీధర్‌రెడ్డి అన్నారు. గోపతండా గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్వారం పీఏసీఎస్ సీఈఓ ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలగిరి: మండల పరిధిలోని గుండెపురిలో రైతు రాశి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తాసీల్దార్ హరిప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ చామంతినరేశ్ పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు : ఎస్‌ఐ అజయ్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

నడిగూడెం, ఏప్రిల్ 18: రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దని ఎస్‌ఐ అజయ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం వల్ల రాత్రివేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు.

# 'రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి'



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి, ఏప్రిల్ 18: మండలంలోని వెలిశాల గ్రామంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని వివిధ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు కడారి లింగయ్య, దూపటి బక్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు చిత్తలూరి సోమయ్య, ఏపూరి మహేశ్, పొలబోయిన యాకయ్య, కడారి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం : మున్సిపల్ కమిషనర్

నేరేడుచర్ల, ఏప్రిల్ 18: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి అన్నారు. నేరేడుచర్ల ప్రధాన కూడలిలో వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వాసవి క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అరుణకుమారి, శ్రీనివాసరావు, లక్ష్మణ్, శ్రీలత, వాసంతి, లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండలంలోని కల్మల్‌చెర్వు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీతరుణి కారు డ్రైవింగ్ స్కూల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ ప్రత్యేకాధికారి తాళ్లూరి సురేశ్ శుక్రవారం ప్రారంభించారు.

# ధాన్యం ఆరబోస్తూ స్పృహ తప్పిన రైతు

- ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి

నూతనకల్, ఏప్రిల్ 18: కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోస్తూ స్పృహ తప్పిన రైతును ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం చందుపట్ల గ్రామానికి చెందిన ఈదులకంటి భిక్షంరెడ్డి (65) నూతనకల్ మండలంలోని ఎర్రపహడ్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోశారు. శుక్రవారం ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు తేమ శాతం అధికంగా ఉందని చెప్పారు. దీంతో తన కుమారుడితో కలిసి ధాన్యాన్ని ఆరబోస్తున్న క్రమంలో భిక్షంరెడ్డి ఒక్కసారిగా స్పృహ తప్పి కిందపడిపోయారు. గమనించిన సమీప రైతులు 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల, ఏప్రిల్ 18: ముకుందాపురం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ కల్లూరు నూతన ఫీడర్ పనులు జరుగుతున్నందున ఈ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నేరేడుచర్ల ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# 27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మోడల్ స్కూల్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగుతుందని, 7,8,9 తరగతుల్లో ప్రవేశాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 98488 57036 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై ఫిర్యాదు

చింతలపాలెం, ఏప్రిల్ 18: ప్రధాని మోదీపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని చింతలపాలెం పోలీస్ స్టేషన్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు పత్తిపాటి విజయ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో అద్దంకి దయాకర్ కనీసం ప్రధాని అన్న గౌరవం లేకుండా మోదీని కేడీ, దొంగ అని అన్నారని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్న అద్దంకి దయాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో కాటెబోయిన లింగరాజుయాదవ్, కొమ్ము రమేశ్, మామిడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

# ఆర్థిక సాయం

నేరేడుచర్ల, ఏప్రిల్ 18: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌కు చెందిన రెడపంగు శోభన్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.3 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జీలకర్ర రామస్వామి, చల్లా ప్రభాకర్‌రెడ్డి, సైదిరెడ్డి, యూసుఫ్, పూర్ణచంద్రారెడ్డి, విశ్వనాథం పాల్గొన్నారు.

# బియ్యం వితరణ

నూతనకల్, ఏప్రిల్ 18: మండల పరిధిలోని ఎర్రపహడ్ గ్రామానికి చెందిన శీలం పెంటయ్య, కుంచెం మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబాలకు మాజీ ఎంపీటీసీ గాడ్దల లింగరాజు బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి శుక్రవారం 50 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదేశానుసారం బియ్యం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, వెంకన్న, సైదులు, రాములు, నర్సయ్య, అవిలయ్య తదితరులు పాల్గొన్నారు.

# డప్పులు బహూకరణ

గరిడేపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీశ్ మ్యూజిక్ బ్యాండ్ అకాడమీకి మండల కేంద్రంలోని పొనుగోడు గ్రామానికి చెందిన మద్దెమడుగు గురవయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సైదులు, శోభ దంపతులు శుక్రవారం రూ.15 వేలు విలువైన 20 డప్పులను బహూకరించారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలను అరికట్టాలి : ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 18: నకిలీ విత్తనాల సరఫరా జరిగి రైతులు నష్టపోక ముందే సంబంధిత అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలను గుర్తించి సీజ్ చేయాలని ఎస్పీ కె.నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత విత్తన సంస్థల డీలర్లు, వ్యాపారులపై ఉందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ తప్పదని హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా ఆంధ్రా ప్రాంతానికి ముఖ్య సరిహద్దుగా ఉండడంతో నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముందస్తు తనిఖీలు చేపట్టడంతో పాటు రైతులకు, డీలర్లకు అవగాహన కల్పించాలని, సరిహద్దుల్లో పటిష్టమైన నిఘాతో నకిలీ విత్తనాలను నివారించాలని వివరించారు. గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్న వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలని, లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయొద్దని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

### 21న పాత సామగ్రి వేలం

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 18: జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పాత టెంట్ సామగ్రి, పాత కంప్యూటర్లు, బ్యాటరీలు, పాత ఇనుప మంచాలు, ఇనుప గొలుసులకు ఈ నెల 21న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్పీ కె.నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ఈ నెల 21న ఉదయం 11 గంటలకు సూర్యాపేట పట్టణ పరిధి ఇందిరమ్మ కాలనీలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 87126 86018 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



వాల్యాతండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంల, ఏప్రిల్ 18: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మండల పరిధిలోని వాల్యాతండా, వట్టిఖమ్మంపహాడ్, కుడకుడ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లోని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరాదీశారు. అనంతరం కాంటా వేసేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని కోరారు. ఆయన వెంట డీఎస్‌ఓ రాజేశ్వర్‌రావు ఉన్నారు.

# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



సూర్యాపేటలో నిర్మల మాత చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు సిలువ ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

సూర్యాపేట టౌన్/నేరేడుచర్ల/కోదాడ/తిరుమలగిరి, ఏప్రిల్ 18: జిల్లా వ్యాప్తంగా గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏసుక్రీస్తు సిలువ ప్రదర్శనతో గ్రామాలు, పట్టణాల్లోని వీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు. మానవళి శ్రేయస్సు కోసమే ఏసుక్రీస్తు సిలువపై మరణం పొందారని పాస్టర్లు పేర్కొన్నారు. ప్రజలంతా ఒకరి పట్ల మరొకరు ప్రేమానురాగాలతో మెలగాలని ఏసుక్రీస్తు ఆకాంక్షించినట్లు తెలిపారు. తాను సిలువపై మరణం పొంది ప్రజలను పాపాల నుంచి విముక్తులను చేశారని అన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న టూరిజం కార్పొరేషన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 18: అనారోగ్య బాధితులకు సీఎంఆర్ ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) అండగా నిలుస్తుందని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన 15 మంది లబ్ధిదారులకు శుక్రవారం సూర్యాపేటలోని తన నివాసంలో రూ. 6.88 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


# 'ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు'



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సుధీర్‌కుమార్

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 18: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు మాధవ స్మారక సమితి ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో మూడు సెంటర్లలో చలివేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు మాధవ స్మారక సమితి అధ్యక్షుడు డాక్టర్ దాచేపల్లి సుధీర్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాధవ స్మారక సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు తుంగతుర్తిలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలో సూర్యాపేటలోని సరస్వతి విద్యా నిలయంలో ఉచిత శిక్షణను ప్రారంభించనున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పర్వతం శ్రీధర్, రామినేని శ్రీనివాస్, కాచం సత్యనారాయణ, బంటు జనార్ధన్, మన్నె గణేశ్, మెంచు నాగరాజు, గట్ల సోమయ్య, అమరవాది రాజేశ్, బయ్యా రమేశ్, కొండ ప్రేమ్, నక్కరబోయిన సాయి పాల్గొన్నారు.

# 'పూలే సినిమాకు సెన్సార్ కట్స్ లేకుండా విడుదల చేయాలి'



కోదాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా చైతన్య వేదిక బాధ్యులు

కోదాడ, ఏప్రిల్ 18: కుల వ్యవస్థ, బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే, ఆయన భార్య సావిత్రీబాయి పూలే జీవిత చరిత్రల ఆధారంగా బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న పూలే సినిమాకు ఎటువంటి సెన్సార్ కట్స్ లేకుండా యథాతథంగా విడుదల చేసేందుకు అనుమతి ఇవ్వాలని ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి వెంకటేశ్వరరావు, సభ్యుడు పందిరి నాగిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోదాడ బస్టాండ్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. బ్రాహ్మణ సమాజంలోని కొందరు వ్యక్తులు ఈ సినిమాలోని డైలాగ్‌లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, బ్రాహ్మణ ఫెడరేషన్ ఈ సినిమాను నిలిపివేయాలని డిమాండ్ చేస్తుందని, వారి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎటువంటి సెన్సార్ కట్లు లేకుండా సినిమా విడుదలకు అనుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వేదిక బాధ్యులు ముత్తవరపు రామారావు, పంది తిరుపతయ్య, రామనరసయ్య, బడుగుల సైదులు, భిక్షం, హరికిషన్‌రావు, నరసింహారావు, ఉదయగిరి, పట్టాభిరెడ్డి, నరేశ్, మురళి, రాధాకృష్ణమూర్తి, గోపాల్‌బాబు పాల్గొన్నారు.